చిరువ్యాపారుల సమస్యను పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేట పాత పండ్ల మార్కెట్ పరిధిలో పండ్ల వ్యాపారం చేసుకునే తమ సమస్యను పరిష్కరించాలని పలువురు చిరు వ్యాపారులు బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన వారిని తీసుకొని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ జగదీష్ వద్దకు వెళ్లి చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వ్యాపారుల సమస్యను తమ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ట్రాఫిక్ సీఐ తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 19, క్యారెట్ 19, దొండ 23, ఆలు 31, ఉల్లి 20, గోకర 28, దోస 15, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్బి 40, మునగ 23, చిలగడదుంప 65, బీట్‌రూట్ 21.

కాలనీల్లో నీటి కటకట!

- మండుతున్న ఎండలు
- అడుగంటిన భూగర్భజలాలు
- నల్లాల నుంచి లోప్రెషర్‌తో నీటి సరఫరా
- నీటి కోసం బస్తీవాసుల అవస్థలు



నాగోలు సాయినగర్ గుడిసెల వద్ద మండుటెండలో నీరు పట్టుకుంటున్న మహిళలు



బిందెల్లో నీటిని తీసుకెళ్తున్న స్థానికులు

నాగోలు: నగరంలో భానుడు భగ భగమంటున్నాడు...రోజు రోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఎల్‌బీనగర్‌లోని పలు కాలనీల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ఎన్నడూ లేని వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటి సరిపడా నీరు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లాల నుంచి తాగునీరు సరిపడా సరఫరా కాకపోవడంతో వివిధ కాలనీలకు జలమండలి అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

- ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోలు సాయినగర్‌లో చాలా కాలంగా గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు తాగునీటి కనెక్షన్లు లేవు. వీరి కోసం జలమండలి అధికారులు పబ్లిక్ నల్లాలు ఏర్పాటు చేశారు. ఎండలు అధికం కావడంతో నీటి వినియోగం పెరిగింది. ఈ నేపథ్యంలో నల్లాలకు నీటి సరఫరా టైమ్ తగ్గింది.
- అంతేకాకుండా లోప్రెషర్‌తో నల్లాల నుంచి నీరు వస్తుండటంతో తమకు అవసరమైన నీరు పట్టుకోలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు. నీటిని పట్టుకొనేందుకు పబ్లిక్ నల్లాల వద్ద మండే ఎండలో నిరీక్షణ తప్పడం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నాగోలు సాయినగర్‌తో పాటు, శ్రీనివాస్ నగర్ కాలనీ, బండ్లగూడ, ఆనంద్‌నగర్, మల్లికార్జున్ హిల్స్, మమతానగర్, శ్రీసాయిరాంనగర్ కాలనీ, ఎన్విరాన్ టవర్స్, లక్ష్మీనర్సింహ కాలనీ తదితర ప్రాంతాల్లో నల్లా నుంచి తాగునీరు లోప్రెషర్‌తో వస్తుండటంతో నీటి కోసం ఆయా కాలనీల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.
- జలమండలి ట్యాంకర్లను బుకింగ్ చేసుకుంటే వారం రోజులైనా రావడం లేదు. దీంతో ఆయా కాలనీల వాసులు ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు పడే వరకు పరిస్థితి ఇలానే ఉంటుందేమోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్తీల్లో, కాలనీల్లో మంచి నీటి సరఫరాలో లో ప్రెషర్ సమస్య లేకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని జలమండలి అధికారులు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నీటిని సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సీఎం సారూ... మాకు ఉద్యోగాలు ఇవ్వండి

సెలెక్టెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులు



మీడియాతో మాట్లాడుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

వనస్థలిపురం: పోలీస్ ఉద్యోగం తమ కల అని, చిన్న చిన్న కేసులు ఉన్నాయని తమను పోలీసు ఉద్యోగాలకు దూరం చేయొద్దంటూ పలువురు కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2022 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌కు చెందిన పలువురు అభ్యర్థులు బుధవారం వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో వేలాది మంది అభ్యర్థులు ఎంపిక కాగా, అందులో మొదటి విడతగా 9 వేల మందికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి వారిని శిక్షణ కోసం పంపారన్నారు. మిగిలిన సెలెక్టెడ్ కానిస్టేబుల్ అభ్యర్థుల్లో సుమారు 1500 మందిపై క్రిమినల్ కేసులు, బైండోవర్, ముందస్తు అరెస్టు కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, విత్‌అవుట్ హెల్మెట్ కేసులు ఉన్నాయని నియామక పత్రాలు ఇవ్వకుండా పక్కన పెట్టారన్నారు. తమపై ఉన్న చిన్న చిన్న కేసులను కొట్టివేసినప్పటికీ తమకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు ఉద్యోగాలు ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు వేడుకున్నారు. సమావేశంలో నల్లగొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి తదితర జిల్లాలకు చెందిన పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

'ఓజోన్' వైద్యుల సేవలు అభినందనీయం



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సన్మానం చేస్తున్న ఓజోన్ ఆసుపత్రి యాజమాన్యం.

దిల్‌సుఖ్‌నగర్: ప్రాణపాయ స్థితిలో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఓజోన్ ఆసుపత్రి వైద్యుల సేవలు అభినందనీయమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అనారోగ్యంతో ఓజోన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వికారాబాద్‌కు చెందిన అమరావతి అనే రోగిని స్పీకర్ మంగళవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం స్పీకర్ ను శాలువాతో ఘనంగా సన్మానించింది. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో కూడా వైద్యులు అత్యుత్తమ వైద్యం అందించి వేలాది మంది ప్రాణాలను కాపాడారని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యసాయి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి ప్రసాద్, సీఈఓ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ రావు, డైరెక్టర్ వై.మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న చెన్నోజు శ్రీనివాసులు

హస్తినాపురం: కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల కోసం వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ సెకండ్ ఇయర్ తరగతులు నిర్వహిస్తున్నాయని, ఆ సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సచివాలయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాలు రాకముందే నారాయణ, శ్రీచైతన్య, ఎస్ఆర్ గాయత్రి వంటి కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారని, తర్వాత అడ్మిషన్లు దొరకవని విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇలాంటి సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు కోరారు.

కాలనీల్లో అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేస్తాం..



ఇన్ఫర్మేషన్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నవజీవన్ రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని పలు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, పనుల్లో నాణ్యతను పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇన్ఫర్మేషన్ కాలనీ పరిసర కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీ మొత్తం డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీధి లైట్లు అవసరం ఉన్న చోటును గుర్తించి కాలనీ వాసులు ఆ వివరాలను తనకు అందించాలని కోరారు, కార్యక్రమంలో జలమండలి అధికారి బాలూనాయక్, కాలనీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో బీజేపీ విజయం ఖాయం: ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

చంపాపేట: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చంపాపేట డివిజన్ పరిధిలోని డిఫెన్స్, ఉదయ్ నగర్, మారుతీనగర్ కాలనీవాసులతో బ్రేక్ ఫాస్ట్ పేరిట బీజేపీ మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డిలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... దేశం మొత్తం మోదీ ప్రభంజనం మార్మోగుతోందని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం మూడోసారి కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు. మోదీ ప్రభుత్వం కరోనా కష్ట కాలంలో రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా వ్యాక్సిన్, రేషన్ షాపుల ద్వారా 5 కిలోల బియ్యం సరఫరా అందించడంతో పాటు పేదలకు ఆరోగ్య కార్డులు, ఇళ్ల నిర్మాణాలు, డిజిటల్ లావాదేవీలు, మహిళలకు టాయిలెట్స్ వంటి పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించారని గుర్తు చేశారు. మోదీకి అందరం అండగా ఉండి ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, అవినాష్‌రెడ్డి, పాశం శ్రీశైలం, రాంపురం శ్రీనివాస్, అనిల్, వెంకటేశ్, బీరప్ప, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీలో భారీ చేరికలు

హస్తినాపురం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీని గెలిపించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో శివసేన పార్టీ నాయకుడు బొమ్మిడి కిరణ్‌రెడ్డి, విక్రమ్ యాదవ్, రామకృష్ణతో పాటు దాదాపు మూడు వందల మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, యువకులు అందరూ బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. మల్కాజిగిరిలో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, టి.ఆచారి,రవీందర్‌రెడ్డి, అవినాష్, రాజవర్ధన్, మహేందర్, కిషోర్‌చారి, మల్లికార్జున్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ప్రెస్ కాలనీవాసులు

మన్సూరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. నాగోలు డివిజన్ పరిధి ప్రెస్ కాలనీలో ఎమ్మెల్యే బుధవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రెస్‌కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న వరద కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగిందని తెలిపారు. మన్సూరాబాద్ ఎస్సీ శ్మశాన వాటికకు ప్రహరీ, స్నానాల గదుల నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించినందుకు ప్రెస్ కాలనీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు చెరకు ప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజిరెడ్డి, టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీష్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, కాలనీవాసులు శంకర్‌గౌడ్, సుభాష్, జంగారెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ బిల్ కలెక్టర్లకు ప్రశంస



బిల్‌కలెక్టర్లకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్

ఎల్‌బీనగర్: ఇటీవల ముగిసిన ఆస్తి పన్ను వసూళ్లలో ఎల్‌బీనగర్ సర్కిల్-3 అధికారులు, సిబ్బంది పనితీరును గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్‌రోస్ ప్రశంసించారు. బుధవారం జరిగిన సమావేశంలో ఎల్‌బీనగర్ సర్కిల్-3 పరిధిలోని అధికారులు సిబ్బంది పనితీరుపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారని డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యానికి మించి వసూళ్లు చేయడంపై కమిషనర్ సిబ్బందిని అభినందించారన్నారు. ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసిన ఇద్దరు బిల్ కలెక్టర్లు అర్చన, శివరాజ్‌లను అభినందించి వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారని ఆయన తెలిపారు. ఏర్లీబడ్ స్కీంలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తామని డీసీ యాదయ్య అన్నారు. తమ సిబ్బందికి కమిషనర్ ప్రశంస పత్రాలను అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి, ఏఎంసీ శ్రీనివాస్‌గౌడ్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ హరికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

రాచకొండ సీపీ తరుణ్‌జోషి



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

మన్సూరాబాద్: నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి సిబ్బందికి సూచించారు. ఎల్‌బీనగర్‌జోన్ డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లతో బుధవారం ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ ఇందిరా ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో నేరాలను అదుపులో ఉంచాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదు చేయటానికి వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా మెలగాలని, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. వృద్ధులు, మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారితో కఠినంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని వివిధ స్టేషన్లలో నమోదైన పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పెండింగ్ కేసులు, ఇతర కేసుల విచారణ పురోగతిని సమీక్షించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.

విధులను సక్రమంగా నిర్వర్తిస్తే ప్రజల మన్ననలు



విశ్రాంత ఎస్ఈ శంకర్‌లాల్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి అన్ని వర్గాల ప్రజలకు తగిన విధంగా న్యాయం చేసినప్పుడే వారు ప్రజల మన్ననలు పొందుతారని, అలాంటి కోవకు చెందిన వ్యక్తి ఎస్ఈ శంకర్‌లాల్ అని ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ అన్నారు. శంకర్‌లాల్ ఉద్యోగ విరమణ సందర్భంగా హస్తినాపురం డివిజన్ తుల్జాభవానీ నగర్‌లో కాలనీవాసులు మంగళవారం రాత్రి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులు శంకర్‌లాల్ దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరైన భారతి లక్పతినాయక్ మాట్లాడుతూ, తమ విధులను సక్రమంగా నిర్వర్తించి అన్ని వర్గాల వారి మన్ననలు శంకర్‌లాల్ పొందారని అభినందించారు. హరికిషన్‌నాయక్, నామ్యా నాయక్, ఎస్ఈ నెనావత్ జీవన్‌కుమార్, బీఎస్ఎన్ఎల్ ఏడీఈ జరుపుల శంకర్, ఈఈ శంకర్, ఏఈ హేమూ నాయక్ పాల్గొన్నారు.

మాదిగలను అవమానించిన కాంగ్రెస్: ఎమ్మార్పీఎస్



ఎంఆర్‌పీఎస్ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మన్సూరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను చిన్నచూపు చేస్తున్నారని పేర్కొంటూ ఆయన దిష్టిబొమ్మను బుధవారం ఎల్‌బీనగర్‌లోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎంఆర్‌పీఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న మాదిగలకు కాంగ్రెస్‌పార్టీ టికెట్ కేటాయించకుండా అవమానించిందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ కులస్తులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అనంతరం ఎల్‌బీనగర్ పోలీసులు ఎంఆర్‌పీఎస్ నాయకులను అదుపులోని తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, శేఖర్‌రాజు, సురేష్, రవి, చిరంజీవి, చిన్న హుస్సేన్, పుల్లయ్య, ముత్యాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు ముందే చెల్లించాలని వేధిస్తున్నారు!



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

భాష్యం బ్లూమ్స్ స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

మన్సూరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం ఫీజును ముందే చెల్లించాలంటూ స్కూల్ యజమాన్యం వేధిస్తోందంటూ హయత్‌నగర్‌లోని భాష్యం బ్లూమ్స్ స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరం ఫీజును ఇప్పుడే చెల్లించాలంటూ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వేధించడంతో పాటు తమకు మెసేజీలు పంపుతోందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయం తెలుసుకుందామని స్కూల్‌కు వస్తే పాఠశాల సిబ్బంది సరైనా సమాధానం ఇవ్వకుండా తమను దుర్భాషలాడారని, అందుకే ఆందోళన చేపట్టామన్నారు. అంతేకాకుండా వచ్చే విద్యా సంవత్సరానికి 25 శాతం ఫీజును పెంచినట్లు సిబ్బంది తెలిపారని తల్లిదండ్రులు మండిపడ్డారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేవైఎం నేతలు స్కూల్‌కు వచ్చి విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనకు మద్దతు పలికారు. ఇలా ఉండగా, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు పోటీగా యాజమాన్యం స్కూల్ ఉపాధ్యాయులచే ఆందోళన చేయించడం కొసమెరుపు.

బీజేవైఎం ఆందోళన...

విషయం తెలుసుకున్న బీజేవైఎం నేత పొట్లపల్లి సాయిరాంగౌడ్ బీజేవైఎం నేతలతో స్కూల్‌కు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. స్కూల్‌కు సీబీఎస్సీ అనుమతి లేకున్నా ఉన్నట్లు ప్రచారం చేస్తూ చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు.

పాఠశాలకు నోటీసులు..

భాష్యం బ్లూమ్స్ స్కూల్‌ను హయత్‌నగర్ మండల విద్యాధికారి హిర్యానాయక్ సందర్శించారు. పాఠశాలకు ఉన్న అన్ని అనుమతి/ధ్రువీకరణ ప్రతాలను రెండు రోజుల్లో చూపించాలని స్కూల్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చామని ఆయన తెలిపారు. స్కూల్ ఉపాధ్యాయుల జీతాలు, ఖర్చుల వివరాలను కూడా అందజేయాలని నోటీసులో పేర్కొన్నామన్నారు.

నేడు కారుణ్య సింధు ఆశ్రమ రజతోత్సవాలు

సైదాబాద్: సేవ, శిక్షణ, సంస్కారం అనే మూడు అంశాల ఆధారంగా తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని అరక్షిత బాలురును చేరదీసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కరుణశ్రీ సేవా సమితి వారి కారుణ్య సింధు ఆశ్రమాన్ని ఏర్పాటు చేశామని ఆశ్రమం కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆశ్రమంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్ కాలనీలో 1999లో ప్రారంభమైన ఆశ్రమం రజతోత్సవ వేడుకలు గురువారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆశ్రమంలో అదనంగా నిర్మించిన మూడు, నాలుగు అంతస్తులను ప్రారంభిస్తామన్నారు.

హోటల్ కార్మికుడి అదృశ్యం

సైదాబాద్: హోటల్ కార్మికుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒరిస్సాకు చెందిన బేణు పదాన్ (50) నెల రోజుల క్రితం గడ్డిఅన్నారంలోని ఒక హోటల్‌లో పనికి కుదిరాడు. గత నెల 29న జీతం డబ్బులు తీసుకున్న అతను తన గదిలో మద్యం తాగాడు. అనంతరం ఫోన్‌ను గదిలోనే ఉంచి సహచర కార్మికులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతను తిరిగి రాకపోవడంతో స్వగ్రామానికి వెళ్లిపోయాడని వారు భావించారు. అయితే, అక్కడికి వెళ్లలేదని తెలిసి పలు చోట్ల వాకబు చేశారు. బేణు పదాన్ ఆచూకీ లభించకపోవడంతో తోటి కార్మికుడు బాబూలాల్ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రచార కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



సైదాబాద్: టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోట్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కోట్ల శ్రీనివాస్ ఐఎస్‌సదన్ డివిజన్ వాణీనగర్‌లోని తన నివాసంలో మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు కృషి చేసే నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్‌లో గుర్తింపు లభిస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణాలోని 14 సీట్లు గెలిచి సోనియా గాంధీకి బహుమతిగా అందజేస్తామన్నారు.